
సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

కలుషిత నీటి సరఫరా నివారణకు చర్యలు

● కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో కలుషిత నీటి సరఫరా నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. శనివారం డివిజన్ పరిధిలోని మోతీ మార్కెట్, కుత్బీగూడ, చప్పల్‌బజార్, మణియార్‌పట్టి తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నల్లాల్లో మంచినీటి సరఫరా సరిగ్గా జరగడం లేదని కలుషిత నీరు వస్తుండడంతో రోగాల బారినపడుతున్నామని స్థానికులు కార్పొరేటర్ కు తెలిపారు. వెంటనే జలమండలి ఏఈ భావనకు కార్పొరేటర్ ఫోన్ చేసి మంచినీటి సమస్యను, కలుషిత నీటి సమస్యను నివారించాలని ఆదేశించారు. మంచినీటి పైప్ లైన్ల మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు ఆర్.సంతోష్, ఓంప్రకాష్, నాగరాజు, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.


గోల్నాక డివిజన్ శంకర్‌నగర్‌లో పారిశుధ్యంపై సమీక్షిస్తున్న కర్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి

గోల్నాక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్‌లో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టిని సారించి పనిచేయాలని ఎస్ఎఫ్ఎలకు కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ సూచించారు. డివిజన్‌లోని శంకర్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో డివిజన్ పారిశుధ్యంపై ఎస్ఎఫ్ఎలతో కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్ సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. డివిజన్‌లోని బస్తీలలో క్లీన్ అండ్ గ్రీన్ పై ఆమె వారితో చర్చించి ఆదిశగా పారిశుధ్యం పనితీరు ఉండాలన్నారు. ఎస్ఎఫ్ఎలు పారిశధ్య నిర్వహణపై దృష్టి సారించి పనిచేయించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, ప్రధాన రహదారులతోపాటు బస్తీలు, కాలనీల్లో ప్రతిరోజు చెత్త ఎత్తివేయాలని ఆమె వారికి చెప్పారు. పారిశుధ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదన్నారు.


మహాధర్నాకు తరలివెళ్లి మద్దతు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, శ్రీనివాస్‌రావు తదితరులు

కులగణన ద్వారా బీసీలకు న్యాయం

ముషీరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణన ద్వారా బీసీలకు న్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ గ్రేటర్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. శనివారం బీసీ కులసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాకు భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలి వెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ మాట్లాడుతూ.... బీసీలంతా ఐక్యంగా ఉన్నప్పుడే న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. బీహార్ తరహాలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

చిక్కడపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నేత ముఠా జైసింహ పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం చేయడంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తున్న పార్టీ గాంధీనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి పోతుల శ్రీకాంత్‌ను శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద జైసింహ సన్మానించారు.

గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్‌పై పోలీసుల దాడి


● 98 గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

● ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

బర్కత్‌పుర, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్‌పై కాచిగూడ పోలీసులు దాడి చేసి ఐదు మంది నిర్వాహకులను అదుపులోకి తీసుకోవడమే కాక 98 గ్యాస్ సిలిండర్లను, రీఫిల్లింగ్ మిషన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కాచిగూడ పీఎస్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి, ఎస్ఐ నరేష్‌కుమార్‌లు తెలిపిన వివరాల ప్రకారం... చప్పల్‌బజార్‌లో నివాసం ఉంటున్న బి.అశ్వినికుమార్(31) హెచ్‌పీ గ్యాస్ సప్లయర్ ఆయనతోపాటు మలక్‌పేట టీవీ టవర్‌కు చెందిన ఎం. జగన్‌మోహన్‌రెడ్డి (54) హీరా గ్యాస్ ఏజెన్సీ ఆటోడ్రైవర్, అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌కు చెందిన కురువ ఆనంద్ (24), కాచిగూడ చప్పల్‌బజార్‌కు చెందిన రాహుల్‌రాయ్ (24), మోతీమార్కెట్‌కు చెందిన బి. ప్రశాంత్ (36) వీరంతా ఓ బ్యాచ్‌గా ఏర్పడి నింబోలిఅడ్డ వద్ద యూకె మోటార్ సర్వీసింగ్ సెంటర్ పేరుతో అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు కాచిగూడ పోలీసులు శనివారం యూకె మోటార్ సర్వీసింగ్ సెంటర్‌పై దాడి చేయడంతో అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్ వ్యవహారం బయటపడింది. నిర్వాహకులు అయిదుగురిని అదుపులోకి తీసుకోవడంతోపాటు వారి నుంచి 98 కమర్షియల్, డోమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. రీఫిల్లింగ్‌కు ఉపయోగించే మిషన్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్ నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

ఎంఎంటీఎస్ రైలు ఢీకొని కార్మికుడి మృతి

బర్కత్‌పుర, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొని సెంట్రింగ్ కార్మికుడు మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. సైదాబాద్‌లో నివాసం ఉంటున్న బాల మైసయ్య కుమారుడు రాజు(22) సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం మలక్‌పేట రైల్వే స్టేషన్ వద్ద రైల్వే ట్రాక్ వెంట నడుచుకుంటూ వెళ్తుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.



తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం మాజీ అధ్యక్షుడు డీ.పీ రెడ్డి రచించిన మెమోరిస్ ఆఫ్ ఆన్ అన్‌సంగ్ వారియర్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ఎం. కోదండరాం

-రాంనగర్, ఆంధ్రజ్యోతి

ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్‌లో

అక్రమాలపై విచారణ జరిపించాలి

● మంత్రి దామోదర రాజనరసింహకు ఆర్.కృష్ణయ్య బృందం వినతి

రాంనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల అమలులో జరిగిన అక్రమాలు అవకతవకలపై విచారణ జరిపించాలని జీవో నంబర్ 550ని సక్రమంగా అమలు చేయాలని సీట్ల కౌన్సెలింగ్‌పై ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్ కృష్ణయ్య బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన చాంబర్‌లో వినతిపత్రం అందజేశారు, ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జీవో 550ని సక్రమంగా అమలు చేయకపోవడంతో 262 మంది ఎస్సీ ఎస్టీ బీసీలకు ఎంబీబీఎస్ సీట్లు దక్కకుండా పోయాయని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం అనేక సంవత్సరాలుగా హైకోర్టు, సుప్రీంకోర్టులతో పోరాటం చేసి జీవో నంబర్ 550ని జారీ చేయిస్తే ఆ జీవోను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సక్రమంగా అమలు చేయకుండా ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లు నిర్వహించారని పేర్కొన్నారు. దీనివల్ల ఎస్సీ ఎస్టీ బీసీలకు రావాల్సిన సీట్లు కోల్పోయి అన్యాయం జరిగిందన్నారు, యూనివర్సిటీ అధికారులు ఉద్దేశ పూర్వకంగానే ఈ జీవోను ఉల్లంఘించారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్లు వారు తెలిపారు. 2019 మెడికల్ కౌన్సెలింగ్‌లో ఓపెన్ కాంపిటియషన్ లాస్ట్ కటాఫ్ మార్కులు 509 కాగా ఆ తర్వాతనే రిజర్వేషన్లు లెక్కించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు గుజ్జ కృష్ణ, సి.రాజేందర్, నందగోపాల్, భూపేష్‌సాగర్, రాజ్‌కుమార్, రఘుపతి, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య బీసీ సంఘాల నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్ ఎల్ పద్మ

కేజీబీవీ నాన్‌టీచింగ్ సిబ్బంది వేతనాలు పెంచాలి

రాంనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రగతి శీల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది వేతనాలను పెంచాలని నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (ఐఎఫ్‌టీయూ) అధ్యక్షురాలు ఎస్ ఎల్ పద్మ డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేజీబీవీలో పనిచేస్తున్న 475 మంది కళాశాలలో పనిచేస్తున్న 300 మంది నాన్ టీచింగ్ వర్కర్‌లకు వేతనాలు పెంచాలని ఖాళీగా ఉన్నపోస్టులను భర్తీ చేయాలని, నైట్ డ్యూటీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, యూనియన్ నాయకులు అరుణ, అశోక్, సాయిదా, సైదమ్మ, లక్ష్మి, రాధ, యాదమ్మ, లక్ష్మినర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.


గాయనీగాయకులను సత్కరించిన వీడీ రాజగోపాల్, కళా జనార్దనమూర్తి

శ్రామికుల పక్షాన రచనలు చేసిన శ్రీశ్రీ

చిక్కడపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): శ్రామికుల పక్షాన నిలిచి శ్రీశ్రీ రచనలు చేశారని వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ మహిళాసంస్థ రాగరాగిణి ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయగానసభలో శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా ప్రముఖ గాయనీగాయకులచే నేను సైతం శీర్షికతో శ్రీశ్రీ సినీ గీత విభావరి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మైన్స్ విభాగం పూర్వ డైరెక్టర్, ఆధ్యాత్మికవేత్త వీడీ రాజాగోపాల్, గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తిలు ముఖ్య ఆత్మీయ అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వం అంటేనే యువత ఎంతో ఉత్సాహం చూపేవారని అన్నారు. ఎక్కడ శ్రామికులు బాధలు పడుతుంటే వారి సమస్యలను ప్రస్తావిస్తూ శ్రీశ్రీ రచించిన కవిత్వం ఆనాటి సమాజంలో ఎంతో చైతన్యం నింపిందన్నారు. సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి. రమణకుమారి, ఎంవీ సుబ్బలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా శశిరేఖ, హిమజ, విజయ్‌కుమార్, ఖాసిమ్, ప్రభాకరరావు, అంబాదాస్‌లు శ్రీశ్రీ గీతాలను మధురంగా ఆలపించారు.

వైకల్య బాధితులకు

ఉచిత వైద్య శిబిరం

● హాజరైన సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

● 150 మంది పేషెంట్లకు స్క్రీనింగ్ పరీక్షలు

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ పోలీస్, ఆకార్ ఆశా ఆస్పత్రి కూకట్‌పల్లి వారి సంయుక్త ఆధ్వర్యంలో.. హాకా భవన్‌లోని భరోసా సెంటర్‌లో శనివారం నిర్వహించిన శారీరక వైకల్యం ఉన్నవారికి ఉచిత పరీక్షలు, శస్త్రచికిత్స శిబిరాన్ని క్రైమ్స్ డీసీపీ శ్వేత, ఉమెన్ సేఫ్టీ డీసీపీ కవితతో కలిసి సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. పుట్టుకతోనే అంగవైకల్యం ఉన్నవారు, ప్రమాదాల బారినపడి వైకల్యం సంభవించిన వారు, అగ్నిప్రమాద బాధితులు, శరీరంపై కణతులు ఉన్నవారికి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా సర్జరీలు చేయడానికి ముందుకొచ్చిన డాక్టర్ బర్టెండ్ స్టైన్, డాక్టర్ షాలినిసంప్రీతి, డాక్టర్ తేజస్వీదాస్‌లను సీపీ అభినందించారు. ఈ వైద్య శిబిరానికి సుమారు 150 బాధితులు హాజరయ్యారు. వారందరికీ వైద్యులు స్క్రీనింగ్ పరీక్షలతో పాటు.. రక్తనమూనాల సేకరణ, ఇతర అవసరమైన పరీక్షలను నిర్వహించారు. వారికి అవసరమైన శస్త్ర చికిత్సలతో పాటు.. వారు పూర్తిగా కోలుకునేంత వరకూ సహకారం అందిస్తామని వైద్యులు వెల్లడించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీ పేషంట్స్‌తో, వారి తల్లిదండ్రులు, సహాయకులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శారీరక దివ్యాంగుల కోసం ఇలాంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఆకార్ ఆశా యాజమాన్యంతో పాటు, షీటీమ్స్, భరోసా సెంటర్ పోలీస్ సిబ్బందిని సీపీ అభినందించారు.


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్‌రెడ్డి

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలి

● టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

బర్కత్‌పుర, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బస్తీ దవాఖానాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరాం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు వేల మంది విధులు నిర్వహిస్తున్నారని వారికి రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. శనివారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో తెలంగాణ బస్తీ దవాఖానా కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కరోనా నిధులు అందరికీ అందలేదన్నారు. టీజేఎస్ కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ కరోనా నిధులు ఉద్యోగులకు అందేలా ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న ఏజెన్సీలను రద్దు చేసి కొత్త ఏజెన్సీలకు కాంట్రాక్ట్ ఇవ్వాలని, ప్రస్తుతం బస్తీ దవాఖానాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనంలో మినహాయించిన పీఎఫ్‌ను అకౌంట్‌లో జమ చేసేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

కార్యక్రమంలో టీఎంహెచ్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్‌బ్రూస్, ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్, తెలంగాణ బస్తీ దవాఖానా కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సుమన్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ అంజాల్ అలీఖాన్, కన్వీనర్ ఎం.ఉప్పలయ్య, ఉపాధ్యక్షులు మల్లెం అనిత, ఎల్.రవీందర్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి రౌతు నర్సింహ, కోశాధికారి ఎస్.శాంతమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం


గంగపుత్రకాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫారం పనులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూసగోరక్‌నాథ్, అధికారులు

గంగపుత్ర కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫారం ఏర్పాటు

ముషీరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీలో వారం రోజులుగా విద్యుత్ ట్రాన్స్‌ఫారం నుంచి ఆయిల్ లీకేజీ కావడంతో లో ఓల్టేజ్ సమస్య ఏర్పడింది. దీంతో శనివారం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు కొత్త ట్రాన్స్‌ఫారాన్ని ఏర్పాటు చేశారు. ఈ పనులను ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూసగోరక్‌నాథ్ పరిశీలించారు. లో ఓల్టేజ్ సమస్య వల్ల టీవీ, ఫ్రిజ్‌లు, విద్యుద్దీపాలు, ఫ్యాన్‌లు కాలిపోయాయని తెలిపారు. ఇలాంటి సమస్య పునరావృత్తం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

బక్రీద్ పండుగకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయాలి

● కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్

ముషీరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు పవిత్రంగా జరుపుకునే బక్రీద్ పండుగకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయాలని భోలక్‌పూర్ డివిజన్ కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్ జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. శనివారం భోలక్‌పూర్‌లో బక్రీద్ పండుగపై జీహెచ్ఎంసీ డీఎంసీ ఖాదర్ మోహిన్ ఉద్దీన్, ఏఎంవోహెచ్ హేమలతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌస్ ఉద్దీన్ మాట్లాడుతూ... మసీదుల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎంసీ ఖాదర్ మోహిన్ ఉద్దీన్, ఏఎంవోహెచ్ హేమలతలు మాట్లాడుతూ.... బక్రీద్ పండుగ సందర్భంగా జంతువులను వధించడం ద్వారా ఏర్పడే వ్యర్థాలను తొలగించడానికి 14 ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. సోమవారం ఉదయం నుంచి మంగళవారం వరకు ఈ వాహనాలు భోలక్‌పూర్‌లోనే కొనసాగుతాయన్నారు.

వరదల సమయంలో జాగ్రత్తలపై ఉచిత శిక్షణ

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వరదలు, రెస్క్యూ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జీహెచ్ఎంసీ ఈవీడీఎం ఆధ్వర్యంలో ఎన్‌జీవో గ్రూపులకు ఒక రోజు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వరద, ముంపు ప్రాంతాల్లో విపత్తు సమయంలో నష్టాన్ని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వాలంటీర్లకు ఫతుల్లాగూడ డీఆర్ఎఫ్ శిక్షణ కేంద్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతోపాటు క్యాంపస్‌లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కల్గిన వారు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె.శ్యాంసుందర్‌రెడ్డి ఫోన్ నం. 7981 665687లో సంప్రదించాలని పేర్కొన్నారు.

తమ్ముడు సినిమాను వీక్షించిన అకీరానందన్

చిక్కడపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు పవన్‌కల్యాణ్ నటించిన తమ్ముడు రీరిలీజ్ సందర్భంగా ఆ సినిమాను ఆయన కుమారుడు అకీరానందన్ శనివారం ప్రేక్షకులతో కలిసి వీక్షించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని దేవి, సుదర్శన్ థియేటర్‌లలో శనివారం స్పెషల్ మార్నింగ్ షోతోపాటు ఫస్ట్‌షో, సెకండ్‌షోలు ఆడించారు. దేవిలో స్పెషల్ మార్నింగ్ షోను చూసిన అకీరా ప్రేక్షకులకు అభివాదం చేశారు. పవన్‌కల్యాణ్ అభిమానులు పెద్దఎత్తున థియేటర్‌కు తరలిరావడంతో అక్కడంతా సందడి వాతావరణం కనిపించింది.

20న కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా శ్రీగణేష్ ప్రమాణ స్వీకారం

సికింద్రాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఎన్.శ్రీగణేష్ ఈ నెల 20న ఉదయం 11 గంటలకు అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శనివారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శ్రీగణేష్ కలిసి ప్రమాణస్వీకారం విషయం చర్చించారు.


డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ, తదితరులు

మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్ల ఆధునికీకరణకు చర్యలు

కవాడిగూడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో జనాభాకు అనుగుణంగా మంచి నీటి, డ్రైనేజీ పైప్‌లైన్‌లను ఆధునీకరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శనివారం కవాడిగూడ డివిజన్ దోమలగూడ పూల్‌బాగ్‌లో నూతనంగా నిర్మించే రూ.17 లక్షలతో నిర్మించే డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి ఉన్న పురాతన మంచినీటి డ్రైనేజీ పైప్‌లైన్‌తో ప్రజలు నిత్యం కలుషిత నీటి సరఫరా, డ్రైనేజీలు పొంగిపొర్లడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు పూల్‌బాగ్ బస్తీలో కలుషిత నీటిసరఫరా అడ్డుకట్ట వేసేందుకు డ్రైనేజీ పైప్‌లైన్ వేయడం జరుగుతుందన్నారు. నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణంతో స్థానిక ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. కార్యక్రమంలోమాజీ కార్పొరేటర్ రవీందర్, బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, రాజాగౌడ్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నగర నాయయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవంలో ప్రజా సంఘాల నేతలు

గృహ కార్మికులకు సమగ్ర చట్టం తేవాలి

● సదస్సులో వక్తల డిమాండ్

రాంనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో పనిచేసే గృహ కార్మికుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చి అందులో ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం ఇతర డిమాండ్లను పరిష్కరించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గృహ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం 2024 జరిగింది. సంఘం అధ్యక్షురాలు ఆన్ జోసెఫ్, సలహాదారు సిస్టర్ లిస్సీ జోసెఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం జరిగింది. పలువురు వక్తలు మాట్లాడుతూ గృహ కార్మికులకుపై జరుగుతున్న వేధింపులను అరికట్టి వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. వారి హక్కులను కాపాడేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గృహ కార్మికులు అధిక సంఖ్యలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచితంగా కుల ధ్రువీకరణ పత్రాల పంపిణీ

చిక్కడపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పద్మశాలీలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తున్న ముషీరాబాద్ పద్మశాలి ప్రజాసంఘం అధ్యక్షుడు తలకొక్కుల సంజీవ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన గాంధీనగర్‌లోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పద్మశాలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.